క్లుప్తంగా

అబ్దుల్ కలాం స్ఫూర్తితో ముందుకుసాగాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



ఆశ్రమంలో చిన్నారులతో కేఎల్లార్

తుక్కుగూడ: విద్యార్థులు ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సూచించారు. సోమవారం మున్సిపాలిటీలోని రావిర్యాల శ్రీ గాయత్రి యోగా ఆశ్రమంలో లీడ్ ఇండియా ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు లీడ్ ఇండియా కార్యక్రమం ద్వారా కేఎల్లార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. సమాజంలో పెద్దలను గౌరవించడం, వ్యక్తిగతంగా, ఉన్నతంగా ఎలా బతకాలో తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కందుకూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ మినీ స్టేడియంలో నిర్వహించిన నవతరం ప్రీమియర్ లీగ్ సీజన్-5 క్రికెట్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో నిలిచిన శివగౌడ్ ధోని జట్టుకు రూ.30వేల నగదుతో పాటు షీల్డ్‌ను ఎస్.శేఖర్‌గౌడ్ అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన టి.అఖిల్ సోనూ జట్టుకు రూ.17వేల నగదుతో పాటు షీల్డ్‌ను డి.కృష్ణ ముదిరాజ్ అందజేశారు. ఈ సందర్భంగా నవతరం యూత్ అధ్యక్షుడు రాజశేఖర్‌గుప్తా మాట్లాడుతూ.. యువతను ప్రోత్సహించడానికి ఇలాంటి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో యువకులతో కలిసి స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో నవతరం యూత్ మాజీ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్‌గౌడ్, టి.కార్తీక్, బి.దీక్షిత్‌రెడ్డి, నిరంజన్, అజీజ్, వెంకటేశ్, శివగౌడ్, సెను, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నందిహిల్స్ అభివృద్ధికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మీర్‌పేట: నందిహిల్స్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కాలనీవాసులతో కలిసి స్థానికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, త్వరలోనే తన కార్పొరేషన్ నిధుల నుంచి రోడ్ల అభివృద్ధికి రూ.6 కోట్లు, పార్కుల కోసం రూ.2 కోట్లు కేటాయిస్తానని హామీనిచ్చారు. భవిష్యత్తులో నందిహిల్స్‌ను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పవన్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రఘుమారెడ్డి, యాదయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నక్ష ఏర్పాటు చేయాలంటూ వినతి

కందుకూరు: మండల పరిధిలోని గఫూర్‌నగర్ వాసులు తమ గ్రామానికి నక్ష లేదని సర్వే చేయించి ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణితో పాటు ఏడీ సర్వే డిపార్టుమెంట్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌డీసీసీబీ డైరెక్టర్ పి.ఆనంద్ మాట్లాడుతూ.. 1997లో అప్పటి అధికారులు గ్రామ పరిధిలోని భూములను సర్వే చేయించారని, ఇంతవరకు మ్యాప్ అమల్లోకి తేలేదన్నారు. దీంతో రైతులు చాలా నష్టపోవాల్సి వస్తుందన్నారు. బ్యాంకులో రుణాలు తీసుకోవాలన్నా, లేక అవసరమైతే విక్రయించాలన్నా ఇబ్బందిగా మారిందన్నారు. 28 ఏళ్లుగా సమస్య ఉన్నా ఇంతవరకు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. త్వరగా సర్వే చేయించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట గ్రామస్తులు జోసెఫ్, దేవానంద్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్ష.. రైతుకు భరోసా

పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే నేల స్వభావాన్ని బట్టి సాగు చేయాలి. అందుకే ప్రతి రైతు ఏటా భూసార పరీక్షలు చేయించాలి. దాంతో పాటే రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి. పంటమార్పిడి చేయాలి. బిందు, తుంపర సేద్యంపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

- భూ సారంతో అధిక దిగుబడి
- రసాయన ఎరువుల వాడకం తగ్గించాలంటున్న అధికారులు
- పంటమార్పిడితో మేలు చేకూరుతుందని సూచన
- అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

మహేశ్వరం: నేలతల్లి ఆరోగ్యం బాగుంటే పంటలు బాగా పండుతుంటాయి. కానీ చాలా మంది రైతులు భూసార పరీక్షలు చేయించుకుకోకుండా ఇష్టానుసారంగా రాసాయనిక ఎవరువులు వేసి, ఒకే పంటను పదేపదే పండిస్తుంటారు. దీని వలన భూసారం కోల్పోయి పంటల దిగుబడులు తగ్గుతుంటాయి. దీనికి తోడు తెగుళ్ల బెడద పెరిగి నష్టాలను మూటగట్టుకుంటున్నారు. దీనిని గమనించిన వ్యవసాయ శాఖ మట్టి పరీక్షలు చేయించుకోవాలని రైతులకు సూచిస్తోంది. పరీక్షలు చేయిస్తే ఫలితాలను బట్టి ఏఏ పోషకాలు అవసరమో తెలుస్తుందని, దీనిని బట్టే పంటల దిగుబడులు చాలా వస్తాయని పేర్కొంటున్నారు. గతంలో చాలామంది రైతులు భూసార పరీక్షలు చేయించుకోవటానికి మొగ్గు చూపేవారని, పచ్చిరొట్ట సాగు చేసి భూసారం పెంచేవారని స్పష్టం చేస్తున్నారు.

అవగాహన లేమితో నష్టం

కానీ కాలక్రమేణా.. సాగులో భారీ మార్పులు చేసుకుంటున్నాయి. రైతులకు వ్యవసాయ అధికారులు సాగులో మెలకువలు నేర్పుతున్నప్పటికీ.. కొందరు కర్షకులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వానాకాలం సాగుపై అన్నదాతలు దృష్టి సారించారు. కానీ భూమిలో పోషకాల స్థాయి తెలుసుకునేందుకు మక్కువ చూపడం లేదని సమాచారం. విరివిగా రసాయన ఎరువులు వాడుతూ, సాగు చేస్తుండటంతో భూమిలో పోషక విలువలు తగ్గి, ఆశించిన మేర దిగుబడులు రాక నష్టపోతున్నారని గమనించిన ప్రభుత్వం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గడిచిన పక్షం రోజులుగా గ్రామాల్లో వ్యవసాయ శాఖ, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా అవగాహన కల్పిస్తోంది. సాగులో సందేహాలను నివృత్తి చేస్తోంది. పంటమార్పిడి, నీటి పొందుపు, బిందు, తుంపర సేద్యం చేయాలని సూచిస్తోంది. భూసార పరీక్షలు చేయించుకోవాలని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని పేర్కొంటుంది. అందుకు తగిన సలహాలు, సూచనలు చేస్తోంది. ఇదిలా ఉండగా.. భూసార పరీక్షలు కొందరు రైతులు మొగ్గు చూపక పోగా.. పరీక్ష చేయించిన వారికి వ్యవసాయ అధికారులు.. సమయానికి ఫలితాలు అందించడం లేదనే విమర్శలు కూడా లేకపోలేదు.

ఫలితాల ఆధారంగా సాగు

భూసార పరీక్షలు చేయించుకొని, వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరమని, భూసార పరీక్షల ద్వారా భూమిలో లవణ సూచిక పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగానికి అవకాశం ఉంటుంది. కొందరు రైతులు ఒకే పంటను తరుచుగా సాగు చేస్తుండడంతో పాటు అధిక రసాయన ఎరువులు వినియోగిస్తుండటం, అధిక రసాయన ఎరువులను వినియోగిస్తుండటంతో భూమి సారం కోల్పోయి పంట దిగుబడులు తగ్గుతాయి.

అవగాహన కల్పిస్తున్నాం



భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయి. ఏటా మట్టి పరీక్ష చేయించాలి. తద్వారా నేలతల్లి ఆరోగ్యం తెలుస్తుంది. ఆ మేరకు కావాల్సిన పోషకాలను ఇవ్వగలిగే ఎరువులు వాడుకునే అవకాశం ఉంది. సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– నాగమణి, మండల వ్యవసాయ అధికారి, మహేశ్వరం

మట్టి నమూనాల సేకరణ ఇలా..

- పొలంలో 10 నుంచి 12 చోట్ల మట్టిని సేకరించాలి.
- చెట్ల కింద, గట్టు పక్కన, కంచెల దగ్గర కాలిబాటల్లో మట్టిని సేకరించకూడదు.
- పశువులు, ఎరువు కుప్పల వద్ద బాగా సారవంతమైన, బాగా నిస్సారంగా ఉన్న చోట్ల కలిపి మట్టి తీయకూడదు.
- చౌడు, మంచి భూముల్లో కలిపి నమూనాలు సేకరించకూడదు.
- రసాయన ఎరువులు వేసిన 45 రోజుల తర్వాతే నమూనాలు తీయాలి.
- గుంతలు తీసేటప్పుడు పైన చెత్తాచెదారాలను తొలగించి, మట్టి పార తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- బురద నేలలో నమూనా తీయకూడదు.
- భూసార పరీక్షలకు అనుగుణంగా భూమిలో పోషకాలు తక్కువగా ఉంటే, వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన ఎరువుల పరిమాణంలో 25 శాతం పెంచి వేసుకోవాలి.
- పోషకాలు ఎక్కువగా ఉంటే 25 శాతం ఎరువులు తగ్గించి వేసుకోవాలి.
- జింకు, ఇనుము, మెగ్నిషియం, బోరాన్ వంటి సూక్ష్మ పోషక లోపాలను తెలుసుకొని, దానికి అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టాలి.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి



హోమంలో పాల్గొన్న భక్తులు

గురూజీ అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి సూచించారు. సోమావతి అమావాస్యను పురస్కరించుకొని భక్తుల సాధక బాధల నివారణకు సోమవారం మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు ఆశీర్వాదాలతో పాటు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా గురూజీ భక్తులకు ప్రవచనాలు చేశారు. ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరికి భగవంతుడి కృప అవసరమన్నారు. అందుకు సాధనకు మించిన మార్గం మరొకటి లేదన్నారు. నిత్యం భగవంతుడి సాధన చేసేవారికి అన్ని విధాలా రక్షణ ఉంటుందన్నారు. తోటి వారితో కూడా మంచిగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నిరుపేద వివాహానికి ఆర్థికసాయం



వధువు తల్లికి నగదు అందజేస్తున్న కరుణాకర్‌రెడ్డి

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ తనవంతుగా సహాయ, సహకారాలను అందిస్తానని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామ పారుశుద్ధ్య కార్మికుడు రాచులూరు మల్లయ్య కుమార్తె వివాహానికి రూ.25వేల ఆర్థికసాయం అందించాడు. కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు ఎనుగుల రాములు, విష్ణు, మంచాల రాజు, ఎండీ.మహబూబ్, బూడిద శ్రీనివాస్‌గౌడ్, ఎనుగుల రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో సర్వేనెంబర్ 58లో ప్రభుత్వ భూమిలో కొంత మంది నిర్మాణాలు చేపట్టడంతో సమాచారం అందుకున్న అధికారులు సోమవారం సదరు నిర్మాణాలను కూల్చివేశారు. సర్వే నెంబర్ 58లో ప్రభుత్వ భూమిలో ప్రభుత్వం నాగోలు పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి, క్రీడా మైదానం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించారు. ప్రభుత్వం నిధులు రాకపోవడంతో అక్కడ ఎలాంటి ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టకపోవడంతో స్థానికులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి అక్బర్ ఆధ్వర్యంలో సోమవారం సదరు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు.

నియామకం

మన్సూరాబాద్: తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎల్‌బీనగర్‌కు చెందిన డాక్టర్ వీరభోగ వసంతరాయలును నియమిస్తూ అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వసంతరాయలు మాట్లాడుతూ.. బీసీ సమాజాన్ని అన్ని రంగాల్లో ఎదిగేలా బీసీ ఫెడరేషన్ కులాల సమితి కార్యచరణ ఉంటుందన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

నాగోలు: కాలనీలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. కొత్తపేట డివిజన్ న్యూ మారుతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో ఏర్పాటు చేసిన 56 సీసీ కెమెరాలను సోమవారం ఆయన కార్పొరేటర్లు నాయికోటి పవన్‌కుమార్, రంగ నరసింహగుప్తా తో కలిసి ప్రారంభిచారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి ఎస్సై భద్రయ్య, న్యూమారుతినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నిరంకి రవి, అసోసియేషన్ సభ్యులు ప్రభాకర్, రవి కేశవ్, మహేష్, శ్రీనివాస్, మురళి కృష్ణ, అంజనేలు, శంకర్, అరుణకుమార్, సంతోష్, శంకర్‌రెడ్డి, రాంచందర్, ఉపేందర్, ఆశీష్‌రావు, సదానంద్, అంజి, సత్తయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ పరిశీలన



పైప్‌లైన్ సమస్యలు జెడ్సీకి వివరిస్తున్న కార్పొరేటర్లు

నాగోలు: ఎల్‌బీనగర్ నుంచి అల్కాపురి చౌరస్తాకు నిర్మాణం చేసే స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్‌ను సోమవారం జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆర్‌కేపురం డివిజన్ మీదుగా ఎల్‌బీనగర్ నుంచి అల్కాపురి జంక్షన్ వరకు వేస్తున్న పైపులైన్ సమస్యను పరిశీలించారు. మూసీ వరకు సరైన అవుట్‌లెట్ లైన్ లేదని జోనల్ అల్కాపురి జంక్షన్ నుంచి మూసీ వరకు పైపులైన్ కలపాలని కార్పొరేటర్లు జోనల్ కమిషనర్‌కు వివరించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు పై నుంచి వచ్చే వరద నీటితో న్యూ నాగోల్, సమితపురి కాలనీ నీట మునుగుతుందన్నారు. స్ట్రాం వాటర్ పైప్‌లైన్ అవుట్ లెట్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మూసీ వరకు అయ్యే అవుట్‌లెట్ అంచనాలను వేయిస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మండల వ్యవసాయ అధికారి నాగమణి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి నాగమణి, సీఐ వెంకటేశ్వర్లు

మహేశ్వరం: ఎరువుల దుకాణాదారులు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి నాగమణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం, మన్సాన్‌పల్లి చౌరస్తా, అమీర్‌పేట్ గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను మహేశ్వరం సీఐ, ఎస్ఐలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎరువుల దుకాణాదారులు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దుకాణాదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు కింద కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అంతకుముందు ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేసి రికార్డులు, రశీదులు, విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రసాద్, ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం



తుక్కుగూడ: రావిర్యాలలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు

కందుకూరు: కాంగ్రెస్ పాలనలోనే నిరుపేదలందరికీ న్యాయం జరుగుతుందని మాజీ సర్పంచ్ రాంచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముచ్చర్లలో పంచాయతీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు బి.సుధాకర్, ఉపాధ్యక్షుడు సి.మల్లేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జి.రామకృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు ఎం.అజయ్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.నర్సింహ, నాయకులు పాల్గొన్నారు.

మీర్‌ఖాన్‌పేటలో..

మీర్‌ఖాన్‌పేటలో మాజీ సర్పంచ్ నర్సింహ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎం.శ్రావణి, బి.సత్యనారాయణరెడ్డి, డి.భాస్కర్, వి.మనీషా తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: మీర్‌ఖాన్‌పేటలో మంజూరు పత్రాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ నర్సింహ

రావిర్యాలలో..

తుక్కుగూడ: మున్సిపాలిటీలోని రావిర్యాలలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోధ పాండురంగారెడ్డి, నాయకులు కోటగళ్ల రాజుకుమార్, మునగని రాజు, తోడేటి గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మలక్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్ అన్నారు. సోమవారం కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ప్రజలు సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.25 లక్షల చెక్కును అక్బర్‌బాగ్‌కు చెందిన పారపల్లి భారతికి అందజేశారు.



చెక్కు అందజేస్తున్న షేక్ అక్బర్

సమస్యల పరిష్కారానికి కృషి



ఆర్డీఓకు ఫిర్యాదు అందిస్తున్న చనువెల్లి రైతులు

ఆర్డీఓ చంద్రకళ

చేవెళ్ల: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. ఇందులో శంకర్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రంలో ఫత్తేపూర్ రోడ్డును బాగు చేయాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్‌కుమార్ ఫిర్యాదు చేయగా, మరొకటి చేవెళ్ల మండలంలోని చనువెల్లిలో పలువురు రైతులు ఖమ్మం నర్సరీలో తెచ్చిన నారుతో మోసపోయామని న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ రెండు ఫిర్యాదులలో ఒకటి శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు పంపించామని, మరొకటి చేవెళ్ల అగ్రికల్చర్ అధికారులకు పంపించి పరిష్కరించాలని సూచించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు దాదాపు 46 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 30కిపైగా పరిష్కరించామన్నారు. ఎక్కువగా భూముల సమస్యలకు సంబంధించి ధరణిలో ఉన్న ఇబ్బందులపై వచ్చిన వాటితో పాటు ఇతర ఫిర్యాదులు ఉన్నాయన్నారు.

భూభారతితో సత్వర పరిష్కారం

భూభారతిలో భాగంగా రైతుల భూ సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అవుతాయని ఆర్డీఓ చంద్రకళ పేర్కొన్నారు. జూన్ 2 నుంచి పూర్తి స్థాయిలో భూభారతి అమలు అవుతుందని తెలిపారు. గత నవంబర్‌లో చేవెళ్ల డివిజన్ పరిధిలో దాదాపు 8వేలకు పైగా పెండింగ్ సమస్యలు ఉంటే అవీ ఇప్పుడు 800లకు వచ్చాయంటే ఏ స్థాయిలో పరిష్కారం అవుతున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. భూముల సర్వేకు సైతం ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇస్తుందని, దీంతో మండలానికి నాలుగైదు మంది సర్వేయర్లు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. . భూమి సరిహద్దులతో పక్కాగా ఉండేందుకు సర్వేలతో సమస్యలు లేకుండా పోతాయని స్పష్టం చేశారు.

అర్హులందరికీ ఇళ్లు అందజేస్తాం

మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్

చేవెళ్ల: అర్హులైన పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మల్కాపూర్‌లో 15 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాలను సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పేదలను గుర్తించి ఇప్పటికే అర్హుల జాబితాను సిద్ధం చేశామన్నారు. లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, నాయకులు